## క్లుప్తంగా

### రోడ్డు ఆక్రమణ తొలగింపు



రోడ్డుకు అడ్డంగా కట్టిన సిమెంటు గోడను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పుంగనూరు: పట్టణంలోని గోకుల్ థియేటర్ వీధి చివర రోడ్డును ఆక్రమించి కొంత మంది అడ్డంగా గోడ కట్టేశారు. ఇది తెలుసుకున్న కమిషనర్ నరసింహప్రసాద్ బుధవారం రాత్రి తమ సిబ్బంది, పోలీసులతో వెళ్లి ఆక్రమణ తొలగించారు. రోడ్డు చివర నివాసం ఉన్న వ్యక్తులు రోడ్డుకు అడ్డంగా సిమెంటు ఇటుకలతో గోడ కట్టారు. దీంతో ఆ ప్రాంత ప్రజల రాకపోకలకు, ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు కూడా కూడా ఇబ్బందికరం కావడంతో స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందించారు. ఎవరైనా మళ్లీ ఆక్రమణలకు పాల్పడితే పోలీస్ కేసులు నమోదు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు.

### ఇన్‌చార్జి ఏవోగా శ్రీనివాస్



రొంపిచెర్ల: మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా పులిచెర్ల వ్యవసాయాధికారి శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడపని చేస్తున్న ఏఓ సుధారాణి మదనపల్లెకు బదిలీ కావడంతో శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

### 106/2 జీవోను రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు

యాదమరి: కేంద్ర ప్రభుత్వ వాహనాలు ప్రమాదాలపై తీసుకొస్తున్న జీఓ 106/2 జీవోను రద్దు చేయాలని మండల కేంద్రంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లారీ యూనియన్ డ్రైవర్లు, క్లీనర్‌లు, జిల్లా సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. చిత్తూరు గుడియాత్తం జాతీయ రహదారిపై గురువారం ఉదయం నిరసన తెలిపారు. అనంతరం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ముందు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 106/2 జీఓ ప్రకారం రహదారుల్లో ప్రమాదం జరిగితే పెద్ద వాహనదారులతో ఎలాంటి తప్పుల్లేకపోయినా డ్రైవర్, క్లీనర్లు అక్కడ ఉండాలని, ప్రమాదంలో గాయపడిన వారికి అన్ని సదుపాయాలు కల్పించి ఆస్పత్రుల్లో చేర్పించాలని, లేకపోతే అపరాధం, జైలుశిక్ష వేయనున్నట్లు జీవోను తీసుకురావడం దారుణమని నిరసించారు. చాలా మంది ద్విచక్ర వాహనదారులు వారే ప్రమాదాలకు కారణమవుతున్నారని పేర్కొన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం జీవోను తీసుకొస్తే దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేయనున్నట్లు వారు హెచ్చరించారు. జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి చైతన్య, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ యూనియన్ నాయకులు అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# జేబులు నింపుతున్న మైలేర్లు!

- సంక్రాంతి మైలేర్ల పేరిట ఇదో దందా
- ఖర్చుకు రెట్టింపు ఆదాయం
- నిర్వాహకుల నుంచి అధికార గణానికి ముడుపులు
- చూసీచూడనట్టు వదిలేస్తున్న ఆయా ప్రాంతాల పోలీసులు



మైలేరులో పరుగులు తీస్తున్న ఎద్దు(ఫైల్)

పలమనేరు: పలమనేరు, కుప్పం నియోజకవర్గాలతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఇక్కడి సరిహద్దు గ్రామాల్లో సంక్రాంతి మైలేర్ల (ఎద్దల పరుగు పందేలు) పండుగ సందడి జోరందుకుంది. ఏటా సాంప్రదాయంగా కేవలం సంక్రాంతి పురస్కరించుకుని ఇక్కడ మైలేర్లు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే కొన్నేళ్లుగా మైలేర్లను సైతం నిర్వాహకులు ఆదాయ వనరుగా మార్చేశారు. పండుగ పేరిట ఎద్దుల ప్రవేశానికి ఎంట్రీ ఫీజులు భారీగా వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. పెట్టుబడి పెట్టిన వాళ్లకు రెట్టింపు సొమ్ము వస్తుండడంతో మారుమూల గ్రామాలకు సైతం మైలేర్ల వ్యాపార సంస్కృతి విస్తరించింది. ఇది ఇక్కడ లాభసాటి వ్యాపారంలా మారింది. కానీ ఎద్దుల పరుగు పందేల్లో వాటిని నిలువరించే ప్రయత్నంలో ఎద్దుల దాడికి గురై మృతి చెందే వాళ్లు.. తీవ్రంగా గాయపడే కుటుంబాలకు మాత్రం మైలేరు తీరని విషాదం మిగుల్చుతున్నాయి.

**ఒక గ్రామాన్ని చూసి మరో గ్రామం**

మూడునెలలుగా తమిళనాడులోని పలు చోట్ల పెద్దమొత్తంలో బహుమతులను ప్రకటించి ఎండ్ల పరుగు పందేలు నిర్వహిస్తున్నారు. దీన్ని చూసి పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని పలు చోట్ల మైలేర్లను నిర్వహిస్తున్నారు. ఓ గ్రామాన్ని చూసి మరో గ్రామం డబ్బులు బాగా దండుకోవచ్చనే అత్యాశతో మైలేర్ల జోరు పెరుగుతోంది. దీన్ని కొందరు లాభసాటి వ్యాపారంలా మార్చుకోవడం ప్రజలకు ఆగ్రహం తెప్పిస్తోంది.

**ఇదిమైలేర్ల చరిత్ర....**

మైలేరు పండుగల్లో తమిళనాడులో మొదటి బహుమతిగా కార్లు, బుల్లెట్ బైక్‌లు లాంటివి ఇస్తున్నారు. ఈ ప్రాంతంలో మాత్రం రూ. 2 లక్షల నుంచి 60 బహుమతులదాకా పెడుతున్నారు. మైలేరు అనే పదం తమిళమే. ఈ ప్రాంతం రెండు రాష్ట్రాల నడుమ ఉండడంతో మిశ్రమ సంస్కృతితో ఈ ఎద్ల పరుగు పందేలను నిర్వహించడం దశాబ్దాలుగా ఇక్కడి ఆనవాయితీ. తమిళనాడులో జల్లికట్లకు, ఇక్కడి మైలేర్లకు ఎంతో తేడా ఉంది. అక్కడ ఎద్దును నిలువరించడం ప్రధానమైతే, ఇక్కడ ఎద్దులను పరుగెత్తిస్తారు. పోటీలు జరిగే చోట కిక్కిరిసిన జనం మధ్య నిర్ణీత ప్రదేశాన్ని (అల్లి) ఎద్దుకు చూపెడతారు. అనంతరం ఒకే ఎద్దును మూడుసార్లు పరిగెత్తిస్తారు. ఈ మూడు దఫాల్లో సరాసరి తక్కువ సెకండ్లలో గమ్యం చేరిన ఎద్దు విజేతగా నిలుస్తుంది. ఒక్కో మైలేరులో 500 నుంచి 1000 దాకా ఎద్దులు పాల్గొంటాయి. వీటిల్లో ఏదైతే తక్కువ వ్యవధిలో నిర్ణీత ప్రదేశానికి వెళుతుందో అది మొదటి బహుమతిని కై వసం చేసుకున్నట్టే! గతంలో గ్రామస్తులు చందాలేసుకుని పండుగను నిర్వహించి వసూలైన డబ్బుకు సరిపడా బహుమతులను ఇచ్చేవారు. దీంతో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా మైలేర్లు జరిగేవి.

**వ్యాపారంగా మార్చేసిన వైనం**

ఏదైనా గ్రామంలో మైలేరును నిర్వహిస్తే నిర్వాహకులకు లక్షల్లో డబ్బులు వస్తున్నాయి. మైలేరులో ఎద్దును వదలాలంటే ఒక్కో దానికి ప్రవేశ రుసుంగా రూ.3వేలు వసూలు చేస్తున్నారు. పోటీకి దాదాపు 500 ఎద్దు వస్తే రూ.15 లక్షలు వస్తాయి. ఇందులో మొత్తం బహుమతులకు అయ్యే ఖర్చు రూ.5 లక్షలవుతుంది. నిర్వహణ ఖర్చు రూ.లక్ష కలుపుకుంటే రూ.6 లక్షలు. మిగిలిన రూ.9లక్షలు నిర్వాహకుల జేబుల్లోకి చేరుతుంది. దీంతో మైలేర్లను నిర్వహించడం యూత్‌కు వ్యసనంగా మారింది. గ్రామ పెద్దలు సైతం దీనిని ప్రోత్సహిస్తున్నట్టు సమాచారం. ప్రవేశ రుసుం పేరిట వసూలు చేసిన మొత్తం సొమ్ములో కొంత పోలీసులకు, మండల స్థాయి నేతలకు, మిగిలించి నిర్వాహకులకు చేరుతోందనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు మైలేర్ల పేరిట జేబులు నింపుకునే కార్యక్రమానికి చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు.





సీఎంకు కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘ నేతలు, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన పవిత్ర, ఎమ్మెల్యే వెంకటేగౌడ, మురళీకృష్ణ తదితరులు

### థ్యాంక్యూ సీఎం.. పెద్దిరెడ్డి సార్!

పలమనేరు: పట్టణానికి చెందిన మున్సిపల్ పారిశుధ్య కార్మికసంఘ నేతలు గురువారం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించిందని దీనికిగాను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తాము ధన్యవాదాలను తెలుపుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ నాయకులు సుబ్రమణ్యం, కార్మిక సంఘ నేతలు శ్రీనివాసులు, రమేష్ బాబు, వెంకటేష్, అంజి, గోపి పాల్గొన్నారు.

పలమనేరు: ఇటీవల రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన పవిత్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న జగనన్నకుఎల్ల వేళలా బీసీలు అండగా ఉంటారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి తదితరులున్నారు.

## జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి





కాగతిలో మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, హాజరైన మహిళా సంఘాల సభ్యులు

చౌడేపల్లె: పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, రాజకీయాలకు అతీతంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేశారని, రానున్న ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించి ప్రజలు కట్టాలని మండల పార్టీ కన్వీనర్ అంజిబాబు కోరారు. గురువారం కాగతి, కొలింపల్లె, అప్పినేపల్లెలో మహిళా సంఘాల సభ్యులకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం మహిళలకు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ఎంతగా వంచించారో అందరికీ తెలుసన్నారు. మళ్లీ మోసపుచ్చే హామీలతో ముందుకొస్తున్న చంద్రబాబు, ఇతర పార్టీల మాటలను నమ్మరాదని కోరారు. సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చిన జగనన్నకు అందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ రమేష్ నాయుడు, సర్పంచులు షంషీర్, సోని, నేతలు బ్రహ్మానందరెడ్డి, గిరిబాబు, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, రామకృష్ణ, నాగరాజ పాల్గొన్నారు.

## వడ్డెర ఓబన్న మార్గంలో పయనిద్దాం





వి.కోట: ఓబన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వడ్డెర కులస్తులు, శాంతిపురం మండలంలో..

వి.కోట: స్వాతంత్య్ర సమరయోధుడు, రేనాటి వీరుడు, వడ్డెర కులస్తుల ఆరాధ్య దైవమైన వడ్డెర ఓబన్న అడుగుజాడల్లో పయనించాలని మండల వడ్డెర నాయకులు పిలుపునిచ్చారు. గురువారం వడ్డెర ఓబన్న 217వ జయంతి పురస్కరించుకుని పట్టణంలోని అంబేడ్కర్, వైఎస్సార్ సర్కిళ్లలో ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో పునీత్, రామచంద్రప్ప, పవన్, చలపతి మండల వడ్డెర కులస్తులు పాల్గొన్నారు.

**వడ్డెర ఓబన్నకు నివాళి**

శాంతిపురం: తమ కులస్తుల ఆరాధ్యుడైన వడ్డెర ఓబన్న జయంతి పురస్కరించుకుని వడ్డెరలు గురువారం ఘన నివాళి అర్పించారు. తులసినాయనపల్లె వద్ద వడ్డెర కమ్యూనిటీ భవనానికి కేటాయించిన స్థలంలో స్థానిక సర్పంచ్ చంగమరాజు ఆధ్వర్యంలో ఓబన్న ఫ్లెక్సీని ఏర్పాటు చేసి ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న, కుల నాయకులు వీరభద్రప్ప, రమణప్ప, మొగిలీశ్వర్ పాల్గొన్నారు.

## బాలలను పనుల్లో పెట్టుకుంటే కేసులు



బాలలను పనుల్లో పెట్టుకోరాదని అవగాహన కల్పిస్తున్న అధికారులు

పలమనేరు: బాలలను పనుల్లో పెట్టుకుంటే కేసులు తప్పవని అసిస్టెంట్ లేబరాఫీసర్ మధుబాబు హెచ్చరించారు. స్థానిక మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ పగడాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని పలు దుకాణాల్లో గురువారం తనిఖీలు చేశారు. దుకాణా యజమానులకు బాలకార్మికుల చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు, స్థానిక కోర్టు న్యాయవాదులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ వర్కర్లకు నోటీసులు

బైరెడ్డిపల్లె: నెల రోజులుగా విధులకు హాజరు కాకుండా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లకు గురువారం ఎంపీడీఓ రాజేంద్రబాలాజి నోటీసులు జారీ చేశారు. పది రోజుల్లో విధులకు హాజరు కావాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులో హెచ్చరించారు. అంగన్‌వాడీ వర్కర్లు నోటీసులు తీసుకోకపోవడంతో వారి ఇళ్ల తలుపులకు అంటించారు. మండలంలో 129 మంది అంగన్‌వాడీ వర్కర్లు ఉండగా జమ్ముగుండ్లపల్లె గ్రామానికి చెందిన నాగవేణి విధులకు హాజరైంది.

## ఆరోపణలు చేస్తే బుద్ధి చెబుతాం



మాట్లాడుతున్న ఎంపీపీ ఈశ్వరయ్య తదితరులు

పుంగనూరు: మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబపై బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ అనవసర ఆరోపణలు చేస్తే తగు రీతిలో బుద్ధి చెబుదామని ఎంపీపీ ఈశ్వరయ్య హెచ్చరించారు. సోమల మండలంలోని పెద్ద ఉప్పరపల్లెలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గురువారం నాయకులు మాట్లాడారు. డబ్బున్న గర్వంతో రామచంద్ర యాదవ్ మిడిసిపడుతున్నారని, గత ఎన్నికల్లోను టోకెన్లు, చీరల పంపిణీ పేరిట ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించి అభాసుపాలయ్యారని అన్నారు. 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న మంత్రి పెద్దిరెడ్డితో సరితూగలేరని, నోరు అదుపులో ఉంచుకోవాలని హితవు పలికారు. సమావేశంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గంగాధర్ రాయల్, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్‌బాషా, జీసీఎస్ కన్వీనర్ మధు, గణపతి యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### మురుగునీటి కాలువ పనుల పరిశీలన



మురుగునీటి కాలువ పనులను పరిశీలిస్తున్న క్యూసీ డీఈ శ్రీనివాసులు

పెద్దపంజాణి: కోగిలేరు పంచాయతీలోని బసవరాజుకండ్రిగ, పొట్టగానిపల్లె గ్రామాలలో జీజీఎంపీ నిధులతో నిర్మిస్తున్న మురుగునీటి కాలువ పనులను గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ క్యూసీ డీఈ శ్రీనివాసులు పరిశీలించారు. పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, ఇకపై మురుగునీటి కాలువ పనులు చేస్తే కాంట్రాక్టర్లు పొడవును కొంతమేర తగ్గించి కాలువలపై స్లాబులు వేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ రవికిరణ్, ఏఈ నందకుమార్, సర్పంచ్ రమేష్‌బాబు, నాయకులు గురునాథరెడ్డి, నాదముని తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



వెంగంవారిపల్లెలో అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

బైరెడ్డిపల్లె: మండలంలోని వెంగంవారిపల్లె, బురిశెట్టిపల్లెలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ పథకాల గురించి తెలియజేశారు. అలాగే బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ అధికారులు తమ సిబ్బందితో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, వైద్యాధికారి విజయ్‌చంద్ర, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ముందస్తు సంక్రాంతి సంబరాలు



పొంగళ్లు పెడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు,



ముగ్గులపోటీ విజేతలతో నిర్వాహకులు

వి.కోట: ముందస్తు సంక్రాతి సంబరాలను గురువారం స్థానిక నలంద విద్యాసంస్థలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో హాజరై భోగిమంటలు వేశారు. గాలిపటాలు ఎగురవేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి మాట్లాడారు.

**కృష్ణాపురంలో..**

కృష్ణాపురంలో సంతూర్ విప్రో కంపెనీ సౌజన్యంతో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలకు మహిళలు పెద్ద ఎత్తున హాజరై, రంగురంగుల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

## ఈరోజు

### వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో సమీక్ష

గుడుపల్లె: మండలంలోని 18 పంచాయతీలకు సంబంధించి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీ రాళ్లగంగమాంబ ఆలయం వద్ద నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ రామక్రిష్ణ తెలిపారు. పార్టీ ఎన్నికల పరిశీలకులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్, రెస్కో చైర్మన్ సెంధిల్ ఎన్నికలపై నియమావళిపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

**ఏ.కొత్తకోటలో ×జగనన్న ఆరోగ్య సురక్ష₹**

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోట గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. ప్రముఖ వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేస్తారని, సచివాలయ పరిధిలోని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**మానసిక ఆరోగ్య ఉచిత వైద్య శిబిరం**

చౌడేపల్లె: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా మెంటల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా మానసిక ఆరోగ్య ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు.ఈ శిబిరంలో ప్రత్యేక మానసిక వైద్య నిపుణులు వైద్యపరీక్షలు చేస్తారన్నారు. మతిమరుపు, తలనొప్పి, నరాల బలహీనత, డిప్రెషన్, గుండెదడ, చైల్డ్ సైక్రియాట్రి మొదలైన సమస్యలున్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలగే దురలవాట్లను మాన్పించడం కోసం కౌన్సెలింగ్ ఇస్తారన్నారు.

**రక్తదాన శిబిరం**

పలమనేరు: సామాజిక సమతా సంకల్ప కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం శుక్రవారం ఉదయం పది గంటలను నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 విజయవాడలో డాక్టర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు.

# హుషారుగా ఆడేశారు







పెద్దపంజాణి : కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు, రొంపిచెర్ల: బాలుర ఉన్నత పాఠశాలలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు, (ఇన్‌సెట్) క్రికెట్‌లో విజేతగా నిలిచిన బొమ్మయ్యగారిపల్లె జట్టు

- ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో సత్తా చాటిన యువత







బైరెడ్డిపల్లె: క్రికెట్ క్రీడాకారులతో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, పుంగనూరు: ఏతూరులో వాలీబాల్ పోటీలు, పులిచెర్ల : కబడ్డీ విజేత గడ్డంవారిపల్లె జట్టు





వి.కోట: క్రికెట్ ఆడుతున్న ఆటగాళ్లు, పులిచెర్ల : వాలీబాల్ విన్నర్స్ మంగళంపేట

పెద్దపంజాణి: స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు ఆసక్తికరంగా సాగాయి. 19 సచివాలయాల పరిధిలోని జట్ల నడుమ నిర్వహించిన కబడ్డీ పోటీల్లో పురుషుల విభాగంలో కోగిలేరు, మహిళల విభాగంలో నాగిరెడ్డిపల్లె జట్లు విన్నర్స్‌గా నిలిచాయని ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్ తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రవికుమార్, తహసీల్దార్ లోకేశ్వరరావు, ఎంఈఓలు గోపాల్ రెడ్డి, తులసీరాం, ఈఓపీఆర్‌ఆర్డీ శారదాదేవి, సర్పంచ్ అఖిల, నాయకులు జాఫర్, రెడ్డి బాషా, సచివాలయ సిబ్బంది, పీఈటీలు పాల్గొన్నారు.

**బైరెడ్డిపల్లెలో..**

బైరెడ్డిపల్లె: ఆడుదాం-ఆంధ్రా క్రీడల్లో భాగంగా గురువారం మండల స్థాయి క్రికెట్ పోటీలనుఎంపీపీ మొగసాల రెడ్డెప్ప ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి 19 టీములు ఈ పోటీల్లో తలపడ్డాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, సచివాలయ సిబ్బంది, పీఈటీలు పాల్గొన్నారు.

**ఉత్సాహంగా క్రికెట్ పోటీలు**

వి.కోట: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలకు సంబంధించి గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. మండలంలోని 25 సచివాలయాల ఉంచి ఒక్కో జట్టు హాజరైంది. ఉత్సాహంగా పోటీల్లో జట్లు తలపడ్డాయి.

**పుంగనూరులో..**

పుంగనూరు: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో రెండవ రోజు మండలంలోని ఏతూరులో పుంగనూరు మున్సిపాలిటీ, మండలంలోని 70 టీములు క్రికెట్, వాలీబాల్ , కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడ్డాయి. పోటీలను ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ నారాయణ, కమిషనర్ నరసింహప్రసాద్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా క్రీడాకారులతో పరిచయం అనంతరం ప్రారంభించారు. క్రీడలను స్ఫూర్తిగా తీసుకుని తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**మండలస్థాయి క్రీడల విజేతలు వీరే!**

పులిచెర్ల(కల్లూరు): మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటలపోటీలకు సంబంధించి వాలీబాల్ పోటీల పురుషుల విభాగంలో మంగళంపేట, కబడ్డీ పోటీల్లో గడ్డంవారిపల్లె, ఖో-ఖోలో కల్లూరు, బ్యాడ్మింటన్ మహిళల విభాగంలో కావేటిగారిపల్లె జట్లు మండల స్థాయి విజేతలుగా నిలిచాయని ఎంపీడీఓ రాజశేఖర్ బాబు తెలిపారు. ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, పీఈటీలు రాజశేఖర్, విమలా విక్టోరియా, రమేష్ బాబు పాల్గొన్నారు.

**సత్తా చాటిన బొమ్మయ్యగారిపల్లె**

రొంపిచెర్ల: ఆడుదాం ఆంధ్రా క్రీడల క్రికెట్ పోటీల్లో బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీ క్రీడాకారులు సత్తా చాట్టారు. క్రికెట్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో బొమ్మయ్యగారిపల్లె జట్లు విజయం సాధించాయి. అలాగే ఖో-ఖో పోటీల రెండు విభాగాల్లో సైతం బొమ్మయ్యగారిపల్లె జట్లే విజయకేతనం ఎగురవేశాయి. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో రొంపిచెర్ల-1, మహిళల విభాగంలో బొమ్మయ్యగారిపల్లె , వాలీబాల్ పురుషుల విభాగంలో రొంపిచెర్ల-1, మహిళల విభాగంలో బొమ్మయ్యగారిపల్లె, కబడ్డీ పురుషుల విభాగంలో బొమ్మయ్యగారిపల్లె, మహిళల విభాగంలో చిచ్చిలివారిపల్లె గ్రామ పంచాయతీ జట్లు విజేతలుగా నిలిచినట్లు ఎంపీడీఓ రాజేంద్ర తెలిపారు. ఐదు క్రీడాంశాల్లో బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీ 7 విజయం సాధించగా, రొంపిచెర్ల గ్రామ పంచాయతీ 2, చిచ్చిలివారిపల్లె గ్రామ పంచాయతీలో 1 చొప్పున విజయం సాధించాయి.

### సెల్‌ఫోన్ల దుకాణ ఉద్యోగిపై ఫిర్యాదు



నిందితుడు సుధీర్‌కుమార్ (ఫైల్)

పలమనేరు: పట్టణంలోని సెలెక్ట్ అనే సెల్‌ఫోన్ దుకాణంలో సేల్స్ విభాగంలో పని చేసే పగడాల సుధీర్ కుమార్ అనే వ్యక్తి దుకాణానికి సంబంధించిన రూ.1.65 లక్షలను దుర్వినియోగం చేశాడని స్థానిక పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసినట్టు సెల్ కంపెనీకి చెందిన దిలీప్ తెలిపారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు తెలిసింది.

### ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం



ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని పీసీఆర్ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో నాడు-నేడులో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎంపీ రెడ్డెప్ప ప్రారంభించారు. ఆ కళాశాలలో గురువారం ప్రారంభోత్సవం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు పథకంలో సర్కారు బడులు, కళాశాల రూపురేఖలు పూర్తిగా మార్చిందని తెలిపారు. రూ.78 లక్షలతో పీసీఆర్ ఒకేషనల్ కళాశాలలో నాడు నేడు పనులు చేపట్టినట్టు వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, మేయర్ అముద, ప్రిన్సిపల్ జయప్రకాష్, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు హేమలత, లెక్చరర్ చిట్టిబాబు పాల్గొన్నారు.